సోమయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్ రావు

సోమయ్యను పరామర్శించిన ఎమ్మెల్సీ

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 12 : సీపీఎం పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య సతీమణి సావిత్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఆమె కుటుంబాన్ని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు పట్టణంలోని వారి నివాసంలో పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, మార్నేని వెంకన్న, రవికుమార్, ఎడ్ల వేణు, మంగళంపల్లి కన్న, రామకృష్ణ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ముల్కలపల్లి నుంచి తిరుమలాయపాలెం వెళ్లే రోడ్డు

రోడ్డు పునరుద్ధరణ

డోర్నకల్, సెప్టెంబర్12: డోర్నకల్ మండలం ముల్కలపల్లి గ్రామం నుంచి తిరుమలాయపాలెం మండలానికి వెళ్లే రోడ్డు పనులు గురువారం పూర్తి కాగా, వాహనాల రాకపోకలు మొదలయ్యాయి. అలాగే బ్రిడ్జికి ఇరువైపులా మట్టి కొట్టుకుపోగా, ట్రాక్టర్ల సాయంతో అధికారులు పోయించారు. దంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.

పాడెమోస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

పాడె మోసిన మాజీ ఎమ్మెల్యే

ఇనుగుర్తి, సెప్టెంబర్ 12 : మండలంలోని మీఠ్యాతండా గ్రామ పంచాయతీకి చెందిన యువకుడు గుగులోత్ వీరన్ననాయక్(30) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ గురువారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరన్న అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కూతురులు, కొడుకు ఉన్నారు.

సావిత్రమ్మకు నివాళి

కురవి, సెప్టెంబర్ 12 : మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, ప్రస్తుత సీపీఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య సతీమణి సావిత్రమ్మ ఇటీవల మరణించగా గురువారం బీఆర్‌ఎస్ కురవి మండల శ్రేణులు మహబూబాబాద్‌కు వెళ్లి సావిత్రమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు తోట లాలయ్య, యూత్ రాష్ట్ర నాయకులు గుగులోత్ రవినాయక్, కురవి ఆలయ మాజీ చైర్మన్ రాజూనాయక్, రాము, మల్లయ్య, ఇరుగు వెంకన్న, ఉపేందర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి

తొర్రూరు, సెప్టెంబర్ 12: సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో మురళీధర్ తెలిపారు. గురువారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు జ్వలిత, ప్రియాంక, మానస, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నయా పైసా రాలేదు

- ప్రభుత్వ సాయం కోసం వరద బాధితుల నిరీక్షణ
- 12 రోజులుగా ఎదురుచూపులు..
- అంచనాల తయారీలో అధికారుల నిర్లక్ష్యం

మహబూబాబాద్, సెప్టెంబర్13 (నమస్తే తెలంగాణ) : వరద సాయం కోసం 12 రోజులుగా బాధితులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్కరికి నయా పైసా సాయం అందలేదు. మానుకోట జిల్లాను ఈ నెల ఒకటిన వరదలు ముంచెత్తాయి. దీంతో చాలా గ్రామాలు నీట మునిగాయి. ఇండ్లల్లోని సామగ్రి వరదల్లో కొట్టుకుపోయి చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. సాగు చేసుకుంటున్న పంట పొలాలు నిండా మునిగి రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నా 12 రోజులుగా పట్టించుకునే వారే కరువయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చి వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని, ఏ ఒక్కరికీ అన్యాయం జరగనీయమని భరోసా ఇచ్చి వెళ్లారు. వరదలతో దెబ్బతిన్న ప్రతి కుటుంబానికి రూ.10వేలు, ప్రతి ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం అందిస్తామని చెప్పారు. తాత్కాలిక సాయం కింద ప్రజలను ఆదుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఇప్పటివరకు వరద బాధితులకు ప్రభుత్వం నుంచి రూపాయి కూడా అందలేదు. సుమారు 80వేల ఎకరాల్లో పంట నష్టం జరగడంతోపాటు 200 చోట్ల రోడ్డు కొట్టుకుపోయింది. 650కి పైగా ఇండ్లు కూలిపోయాయి. ఉండడానికి ఇల్లు లేక తినడానికి తిండి లేక ప్రజలు అల్లాడతున్నారు. బుధవారం జిల్లాలో పర్యటించిన కేంద్ర బృందానికి సైతం వరద బాధితులు పైసా సాయం అందలేదని విన్నవించారు. వేల ఎకరాల్లో ఇసుక మేటలు, రాళ్లు రప్పలు వచ్చి చేరి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వరదలు వచ్చి 12 రోజులు గడుస్తున్నా, అదికారులు అంచనాలతోనే సరిపెడుతున్నారు. నివేదికలు కూడా రహస్యంగా ఉంచుతూ, అంత కలెక్టరేట్‌లో ఉంది.. కలెక్టర్‌ను అడగండి.. అని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. పూర్తి నివేదికకు మరో నాలుగైదు రోజులు పట్టే అవకాశం ఉంది. వరద వచ్చిన మరుసటి రోజు చెప్పిన అంచనాలకు, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో చేస్తున్న అంచనాలకు పోలికే లేకుండా పోయింది. అంచనాలు తారుమారు కావడంతో వరద బాధితులు ఆందోళన చెందుతున్నారు.

సీతారంతండాలో ఇంట్లోకి చేరిన బురద బిందెల్లోకి ఎత్తుతున్న కుటుంబ సభ్యులు (ఫైల్)

నాకు సర్కారు సాయం అందలే..

వరదలకు ఇల్లు మొత్తం కూలిపోయింది. ఉండడానికి ఇల్లు లేదు. నాకు ముగ్గురు బిడ్డలు, కొడుకు. అందరికీ పెండ్లిళ్లు అయినయి. కొడుకు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. నాకు మోకాళ్ల నొప్పులు ఉంటే, కొడుకు పట్నం తీసుకుపోయి ఆపరేషన్ చేయించిండు. మొన్ననే ఇక్కడికి వచ్చిన. ఇక్కడి వచ్చిన మరుసటి రోజే వరదలకు ఇల్లు మొత్తం కూలిపోయింది. కొంచెమైతే నా ప్రాణాలు పోయేవి. ఇంట్లో ఉన్న వస్తువులన్న పాడైనయి. తినేందుకు తిండి లేక, ఉండేందుకు ఇల్లు లేక అవస్థలు పడుతున్నా. ఇప్పటి వరకు సర్కారోళ్లు ఏమి ఇవ్వలేదు. ఉండడానికి ఇల్లు నిర్మించి ఇవ్వాలి.

–చిన్న నర్సమ్మ, వరద బాధితురాలు, రావిరాల, నెల్లికుదురు

చేప పిల్లలకు పరిహారం ఇవ్వరట..

కురవి మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టను ఆనుకొని తుల్స్యాతండాకు వెళ్లే రోడ్డు పక్కన మా తండ్రి వారసత్వంగా179 సర్వే నంబర్ లో నాకు 2.20గుంటలు, నా భార్య సుశీల పేరు మీద 5.30 గుంటల భూమి ఉంది. రెండున్నర ఎకరాల భూమిలో సొంతంగా రాజమండ్రికి వెళ్లి చేప పిల్లలను తీసుకొచ్చి చేపలు పెంచుతున్నా. ఇటీవల వచ్చిన వరదలకు చేప పిల్లలతోపాటు భూమి మొత్తం కోతకు గురైంది. పరిహారం కోసం సంబంధిత అధికారులకు ఫోన్ చేస్తే ఏదైనా సొసైటీ నుంచి చేప పిల్లల పెంపకం చేపడితేనే నష్టపరిహారం వస్తుందని, రైతులు సొంతంగా చేపడితే రాదని చెప్పడం విడ్డూరంగా ఉంది.

– బత్తిని సత్తయ్య, రైతు, కురవి

వరద సాయం రూ.10వేల కోట్లు కేటాయించాలి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 12 : ఇటీవల కురిసిన భారీ వర్షాలను కేంద్రప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి తెలంగాణకు రూ.10వేల కోట్ల వరద సాయం ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్ సారథి అన్నారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులు ఉండి కూడా రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. చెరువులు తెగి ప్రజలు ఇబ్బందిపడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సోయి లేదన్నారు. ఈ కార్యక్రమంలో అజయ్ సారధి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

వరద బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రగయ్య అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పర్యటించి ఇచ్చిన హామీలను ఇంత వరకు అమలు చేయలేదన్నారు. సీతారాంతాండా, రావిరాలలో ప్రజలు ఇబ్బందిపడుతున్నా ఎమ్మెల్యేలు వారి వైపు కన్నెత్తి కూడా చూడడం లేదన్నారు. పంటలు దెబ్బతిన్న ఎకరాకు రూ.30వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50వేలు సాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, పాయం చిన్న చంద్రన్న, కొత్తపల్లి రవి, జగ్గన్న, వీరన్న, సూర్యం, యాకయ్య పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ వహించాలి

గూడూరు, సెప్టెంబర్12 : చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈవో వీ రాజేశ్వర్ అన్నారు. గురువారం మండలంలోని తీగలవేణి, అయోధ్యపురం, గూడూరు ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 10వ తరగతి పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించేలా చూడాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గూడూరు: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలి

కేసముద్రం, సెప్టెంబర్ 12 : ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని డీఈవో రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని పెనుగొండ ప్రభుత్వ పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల రిజిస్టర్లను పరిశీలించి మాట్లాడారు. 10వ తరగతిలోఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీజీఈ మందుల శ్రీరాములు, హెచ్‌ఎం యాదగిరి పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో శాస్త్రవేత్తల పర్యటన

మరిపెడ, సెప్టెంబర్12 : భారీ వర్షాలతో చెరువులు, వాగులు ఉప్పొంగి పంట నష్టం జరిగిన గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఉల్లెపల్లి, తండధర్మారం గ్రామాల్లో వరి, పత్తి, ఆయిల్‌పామ్ తదితర పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వీరన్న ప్రిన్సిపల్ సైంటిస్టు (ఆర్‌ఏఆర్‌ఎస్ వరంగల్, కాటన్), సతీశ్‌చంద్ర (వరి), మల్యాల శాస్త్రవేత్తలు మాలతి, రాంబాబు, క్రాంతి కుమార్, వ్యవసాయాధికారి విజయనిర్మల, ఏడీఏ విజయచంద్ర పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో పంటలను పరిశీలిస్తున్న శాస్త్ర వేత్తలు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HOSPITAL STAFF

jobs Apply Now!

★LAB TECHNICIANS-BOYS,
★PHARMACY BOYS (మందుల షాపు)
★OT BOYS కావలెను. సంప్ర : Guardian Hospital, Mulugu 'X' Road, Warangal. 12 to 2 PM.
NTW-0427

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

వరద బాధితులకు చేయూత

నెల్లికుదురు, సెప్టెంబర్ 12 : నిర్మన్ ఆర్గనైజేషన్ సంస్థ సహకారంతో ఇన్ఫోసిస్ వారి సౌజన్యంతో మండలంలోని రావిరాల వరద బాధితులకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ సీనియర్ మేనేజర్ ఉషాకర్ మాట్లాడుతూ.. 138 మంది వరద బాధితులకు రూ.3వేల చొప్పున విలువ చేసే నిత్యావసర సరుకులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ కో ఆర్డినేటర్లు మహేశ్, రామకృష్ణ, ఎంపీడీవో బాలరాజు, తహసీల్దార్ రాజు, కళాధర్ రాజు, గణేశ్ పాల్గొన్నారు.

దుబ్బగడ్డ తండాలో వరద బాధితులకు సరుకులు అందజేస్తున్న గ్రేటర్ ఈస్టర్ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు.

నెల్లికుదురు: రావిరాల గ్రామ బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న నిర్మన్ ఆర్గనైజేషన్ బాధ్యులు

నిత్యావసర సరుకుల పంపిణీ

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 12 : వరద బాధితులకు గురువారం పెరుమాండ్ల జగన్నాథం భవనంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అకాల వర్షాలతో అనేక కుటుంబాలు కనీస వసతులు లేక ఇబ్బంది పడుతున్నాయని, ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి తగిన సాయం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు కోరారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్, సెప్టెంబర్ 12 : దుబ్బగడ్డతండా, మోదుగుగడ్డ తండాల్లో వరద బాధితులకు హైదరాబాద్ గ్రేటర్ ఈస్టర్ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. దుబ్బగడ్డతండా 50 మందికి, మోదుగుగడ్డ తండా 48 మందికి 10కిలోల చొప్పున బియ్యం, దుప్పట్లు, నిత్యావసర సరుకులు, దుస్తులను జడ్పీ సీఈవో నర్మద చేతులు మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో మున్వర్‌భేగ్, పంచాయతీ కార్యదర్శులు చంద్రయ్య, శ్రీనివాస్, బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మన్నెగూడెంలో..

చిన్నగూడూరు, సెప్టెంబర్ 12 : ఇటీవల కురిసిన భారీవర్షాలకు ఆకేరు ఉప్పొంగి మన్నెగూడెంలో పలువురి ఇండ్లు నీటమునిగాయి. జయ్యారం ఉన్నత పాఠశాలలో చదివిన 2004 టెన్త్‌బ్యాచ్ విద్యార్థులు వారికి అండగా నిలిచారు. గురువారం గ్రామస్తులకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో బొమ్మకంటి వెంకట్‌గౌడ్, కృష్ణ, భరత్‌రెడ్డి, ప్రవీణ్, అజయ్, అశోక్, నరేశ్, మల్లయ్య, విజయ్ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం

కురవి, సెప్టెంబర్ 12 : మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలలు, నేరడలోని మోడల్ స్కూల్, కేజీబీవీని గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. మోడల్ స్కూల్ టీచర్లకు సర్వీస్ రూల్స్ రూపొందించి పదోన్నతులు, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. కేజీబీవీల్లో శ్రమ దోపిడీని అరికట్టేందుకు వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కస్తూర్బా ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయడం టీ తాగినంత పని అని, వెంటనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు కాలయాపన చేస్తే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్, బలాస్టి రమేశ్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండ్ల విజయ కుమార్, ఓదెల శివకుమార్ పాల్గొన్నారు.

నేరడలోని కస్తూర్బా ఎదుట మాట్లాడుతున్న శ్రీశైలం

బీఆర్‌ఎస్‌తోనే పేదలకు మేలు

డోర్నకల్, సెప్టెంబర్ 12: బీఆర్‌ఎస్‌తోనే పేదలకు మేలు జరుగుతున్నదని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మన్యు పాట్నీ అన్నారు. గురువారం డోర్నకల్ మండల దుబ్బతండాకు చెందిన ఉమాదేవికి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి సహకారంతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. చెక్కు మంజూరు చేయించిన ఎమ్మెల్సీ సత్యవతికి బాధితురాలు కృతజ్ఞతలు తెలిపింది.

డోర్నకల్‌లో బాధితురాలికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు మన్యు పాట్నీ

కరెంట్ మీటర్లు మంజూరు చేయాలి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 12 : నిరుపేదల ఇండ్లకు ఎలాంటి నిబంధనలు పెట్టకుండా విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. గురువారం ఆయన స్థానిక కౌన్సిలర్లతో కలిసి విద్యుత్ ఎస్‌ఈ నరేశ్‌తో మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో అనేక మంది పేదలకు నిబంధనలు పెట్టడం వల్ల మీటర్లు రాకుండా ఇబ్బందిపడుతున్నారని, పేద ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. ఇంటి నంబర్లతో సంబంధం లేకుండా మీటర్లు ఇవ్వాలన్నారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 12 : జిల్లాలో గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1706 విగ్రహాలను ఏర్పాటు చేశారని, ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, నిమజ్జనానికి డీజేలు, సౌండ్ సిస్టం, పటాకులు కాల్చడం వంటివి చేయొద్దన్నారు.

28న జాతీయ లోక్ అదాలత్

మహబూబాబాద్ రూరల్ :జిల్లా కోర్టులో ఈ నెల 28న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని జిల్లా జడ్జి రవీంద్ర శర్మ కోరారు. గురువారం జిల్లా కోర్టులో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కోర్టులో వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇవి రెగ్యులర్ కోర్టులో పరిష్కారం కావాలంటే ఏండ్లు పడుతుందన్నారు. ఈ కేసులను రాజీమార్గంలో పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సురేశ్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో పూజలు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 12 : పట్టణంలోని పలు వినాయక మండపాల వద్ద ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దేవుడిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మంగళంపల్లి కన్న, వెంకన్న, రాములు, వేణు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతు చేయాలి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 12 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న వాకింగ్ ట్రాక్‌కు వెంటనే మరమ్మతు చేయించాలని ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ నాయకుడు ఉపేంద్రం అన్నారు. గురువారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య, సాంబయ్య, రవీంద్ర, మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులు విధుల్లో చేరాలి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 12 : గిరిజన సంక్షేమ శాఖలో బదిలీ అయిన ఉద్యోగులు వెంటనే విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసునాయక్ అన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు బదిలీ అయినా రిలీవ్ కాకుండా అదేస్థానంలో విధులు నిర్వరిస్తున్నా డీడీ పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో రమేశ్, వెంకన్న పాల్గొన్నారు.

12 క్వింటాళ్ల బియ్యం వితరణ

గార్ల,సెప్టెంబర్ 12 : గణేశ్ నవరాత్రులను పురస్కరించుకొని మండల కేంద్రంలోని వినాయక మండపాలకు 12 క్వింటాళ్ల బియ్యాన్ని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మన్‌నాయక్ – భారతి దంపతులు గురువారం పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని 24 మండపాలు ఉండగా ఒక్కో మండపానికి 50 కిలోల చొప్పున 12 క్వింటాళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గట్టు అనంతరాములు, కోట ఉత్తరయ్య, పానుగంటి రాధాకృష్ణ, శీలంశెట్టి రమేశ్, ఉమేశ్, గణేశ్, సంపత్, శ్రీను, ప్రభాకర్, సాయి పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి

గార్ల, సెప్టెంబర్ 12: నూతనంగా తీసుకొచ్చిన విద్యా విధానాన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ కే యాకూబ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు భద్రూనాయక్, మంగయ్య, మండల అధ్యక్షులు సుందర్‌కుమార్, కార్యదర్శి షరీఫ్, దేవేందర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు నూతన భవన ప్రారంభం

తొర్రూరు, సెప్టెంబర్ 12: ఆయుర్వేద వైద్యశాల నూతన భవనాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఆయుర్వేద సీనియర్ వైద్యాధికారి డాక్టర్ పాలడుగుల కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట నిర్మించిన ఆయుర్వేద వైద్యశాల ప్రారంభోత్సవానికి కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, ఆయుష్ శాఖ ప్రాంతీయ ఉప సంచాలకురాలు డాక్టర్ ప్రమీల, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య తదితరులు పాల్గొంటారని తెలిపారు.

అనర్హుల కార్డులు తొలగించాలి

ఇనుగుర్తి, సెప్టెంబర్ 12 : మండలంలోని కోమటిపల్లి శివారు తండాల్లో అనర్హుల అంత్యోదయ కార్డులను తొలగించాలని తండావాసులు గురువారం కేసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సపావత్ నందా, గుగులోత్ భీమా, రాజు, రమేశ్, ఈరు, కీమా, రవి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కేసముద్రం, సెప్టెంబర్ 12 : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి మురళీధర్ అన్నారు. ఆశ డే సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భ్రూణహత్యలు నేరమని, ఇందులో ఎంతటి వారున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈఎంవో కొప్పుల ప్రసాద్, డీపీఎంవో రవీందర్, హెచ్‌ఈలు రాజు, పురుషోత్తం పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

కేసముద్రం, సెప్టెంబర్12 : ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ శాంతిరాజ్ సూచించారు. ఆశ డే సందర్భంగా గురువారం ఆయన మండలంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దన్నారు. సలహాలు, సూచనల కోసం 1097 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ ప్రత్యేక కార్యదర్శి అమరలింగేశ్వరరావు, కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, డీపీఎం రవీందర్‌రావు, వైద్యులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

డోర్నకల్, సెప్టెంబర్ 12 : పురుగుమందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం జోగ్యతండాలో జరిగింది. ఏఎస్సై కథనం ప్రకారం... జోగ్యతండాకు చెందిన చందావత్ భద్రు (30) మానసిక స్థితి సరిగా లేదు. తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయం క్షేత్రానికి వెళ్లిన భద్రు మధ్యాహ్నం చెట్టు వద్ద ఉన్న పురుగుల మందు తాగాడు. ఖమ్మం ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ముదిరాజ్‌లను ప్రభుత్వం ఆదుకోవాలి

మరిపెడ, సెప్టెంబర్12 : భారీ వర్షాలతో చెరువులు, కుంటలు తెగిపోయి మత్స్య సంపదను కోల్పోయిన ముదిరాజ్ కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శి పిట్టల ధనంజయ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మరిపెడలో ఆయన మాట్లాడుతూ.. చేపపిల్లలు వరదల తాకిడికి వెళ్లిపోయి ముదిరాజ్‌లకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. కార్యక్రమంలోమండల అధ్యక్షుడు బయ్య ఉపేందర్, నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీను, రమేశ్ పాల్గొన్నారు.